

నేను.. ఎమ్మార్వో ఆఫీస్ నుంచి..
నేరడిగొండ తహసీల్ కార్యాలయ అటెండర్ ఓ మహిళకు అసభ్యకర ఆడియో మెసేజ్‌లు పంపాడు. దీంతో బాధితురాలి గ్రామస్తులు అతడికి దేహశుద్ధి చేశారు. 8లో▸



ప్రభుత్వ బడులకు చేయూత
ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. విరాళాలు ఇచ్చి సర్కారు పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.0 /29.0
మధ్యాహ్నం ఎండ తీవ్రత కొనసాగుతుంది. వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

రేపు ఘనంగా గిరిజనోత్సవం

కైలాస్‌నగర్/ఉట్నూర్ రూరల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17న ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్‌లోని హెచ్‌కేజీఎస్ గార్డెన్స్‌లో గిరిజనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కే వరుణ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, సార్‌మేడిలు, ఐటీడీఏ, జిల్లా శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు, యువత, అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

17న జాతీయ జలశక్తి అవార్డులు ప్రదానం

కైలాస్‌నగర్: నీటి సంరక్షణ, నిర్వహణకు గాను కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఇదివరకు ప్రకటించిన జాతీయ నీటి అవార్డులను అందించే తేదీలు ఖరారు చేసింది. ఉత్తమ జిల్లాల కేటగిరీలో ఆదిలాబాద్ దేశంలోనే మూడో స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఈ నెల 17న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులను ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకడ్ చేతుల మీదుగా ప్రదానం చేయనున్నట్లు కేంద్ర జలశక్తిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవార్డును కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నారు.

ఘనంగా భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు



సుజాతకు కేక్ తినిపిస్తున్న సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలోని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత నివాసంలో ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ కేక్ కట్ చేశారు. భట్టి పాదయాత్ర గురించి వివరించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు నగేశ్, నాయకులు ఆనంద్, ప్రభాకర్, ఆశన్న, శ్రీధర్, మధుకర్, రూపేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

ఉట్నూర్‌రూరల్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క జన్మదినాన్ని పురస్కరించుకొని ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండలంలోని హస్నాపూర్ గ్రామంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు పెందూర్ ప్రభాకర్, పుర్క బాపురావు, సునీల్‌జాదవ్, సాగర్, సిరాజ్‌ఖాన్, సీతారాం, శేషు, రాహుల్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్' దోపిడీని అరికట్టాలి

ఎదులాపురం: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఈ దోపిడీని వెంటనే అరికట్టాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొట్టూరి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. పాఠశాలల్లోనే యూనిఫాంలు, పుస్తకాలు, టై.. బెల్టులు బహిరంగంగా విక్రయిస్తున్నారని, తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తోక పేర్లతో నిర్వహిస్తున్న, అవినీతికి పాల్పడుతున్న పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కొండూరి సాయికుమార్, అనికేత్, అక్షయ్, దత్తు, సాయి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్

- 39 మంది విద్యార్థుల డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో జిల్లాలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతోంది. ఇందుకు విద్యార్థుల డిబార్లే నిదర్శనం. పరీక్షలు ప్రారంభమైన తొలిరోజే ఇచ్చోడలో ఏకంగా 66 మంది డిబార్ అయ్యారు. గురువారం జిల్లా వ్యాప్తంగా 39మంది డిబార్ అయినట్లు పరీక్షల విభాగం అసిస్టెంట్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు.

సీపీఆర్‌తో ప్రాణాలు నిలుపవచ్చు

ఆదిలాబాద్‌టౌన్: కార్డియాక్ అరెస్ట్ కారణంగా ఇటీవల మరణాల సంఖ్య పెరిగిందని, సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో మనోహర్ పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ టీచర్లకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణాధికారి స్వామి, ఆదిలాబాద్ అర్బన్ సీడీపీవో వనజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెర



జిల్లా ఉపాధికల్పన శాఖ కార్యాలయం



- మిల్కాకు రెండు బాధ్యతలు
- మహిళా సంక్షేమం, ఉపాధికల్పన..
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, ఆదిలాబాద్: మహిళా శిశు సంక్షేమంతోపాటు ఉపాధికల్పన శాఖకు మిల్కా ఇటీవల పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఏసీ) స్వీకరించారు. కొద్ది రోజులుగా ఆయా శాఖలకు ఎవరిని అధికారులుగా నియమిస్తారనే ఉత్కంఠ నెలకొనగా ఆమెకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. జిల్లా సంక్షేమాధికారిగా మిల్కా కొనసాగుతూ వచ్చారు. మే 4న రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి ఎనిమిది మంది అధికారులకు ఉద్యోగోన్నతి కల్పించి డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) హోదా కల్పించారు. ఆయా జిల్లాలకు వారిని డీడబ్ల్యూవోలుగా అప్పట్లో నియమించారు. అందులో భాగంగా ఆదిలాబాద్‌కు డీడబ్ల్యూవోగా సుభద్రను కేటాయించారు. దీంతో మిల్కా డీడబ్ల్యూవో ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలిగారు. ఆ తర్వాత ఉపాధి కల్పనశాఖ అధికారి పోస్టు కోసం ఆమె ప్రయత్నాలు ప్రారంభించారు. మాతృశాఖ మహిళా శిశు సంక్షేమం నుంచి మరో శాఖ ఉపాధికల్పనకు (ఫారెన్ సర్వీస్) కావడంతో సంబంధిత శాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి ఆమోదం తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. కలెక్టర్ నుంచి ఆమెను ఉపాధికల్పన శాఖ సర్వీస్‌కు తీసుకునే విషయంలో కమిషనరేట్‌కు లేఖ పంపిన తర్వాత అక్కడి నుంచి ఆమోదం రావడంలో జాప్యం జరిగింది. ఈ సమయంలోనే మే 10న మహిళా శిశు సంక్షేమ శాఖకు డీడబ్ల్యూవోగా సుభద్ర బాధ్యతలు స్వీకరించడం, అదేరోజు మూడు నెలల పాటు సెలవు పెట్టి వెళ్లడంతో మళ్లీ ఈ పోస్టు ఖాళీ అయింది. అయితే అప్పటికే ఉపాధికల్పనశాఖ అధికారిగా ప్రయత్నాలు చేస్తున్న మిల్కా తిరిగి డీడబ్ల్యూవోగా కూడా వస్తారా? అనే చర్చ మొదలైంది. అదే నిజం చేస్తూ ఆమె తిరిగి ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. ఇలా ఉండగానే ఉపాధికల్పన శాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి ఆమెను ఫారెన్ సర్వీస్‌కు తీసుకునే విషయంలో అనుమతి రావడంతో ఇక ఆ శాఖకు కూడా ఎఫ్‌ఏసీ బాధ్యతలు స్వీకరించారు. తద్వారా రెండు శాఖలకు ఆమెనే అధికారిగా గతకొన్ని రోజులుగా కొనసాగుతున్నారు.

రెండు శాఖలూ ఆమెకే..

మహిళా శిశు సంక్షేమశాఖ డీడబ్ల్యూవో సుభద్ర సెలవుపై వెళ్లిన తర్వాత మళ్లీ మిల్కా ఈ కుర్చీ కోసం ప్రయత్నాలు చేస్తారా? అని ఆ శాఖలో చర్చ సాగింది. ప్రధానంగా జిల్లాలో సీనియర్ సీడీపీవోగా ఉన్న వారికి ఈ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారని భావించారు. ఆదిలాబాద్ అర్బన్ సీడీపీవో వనజకు సీనియార్టీ దృష్ట్యా ఆ పదవి దక్కవచ్చని అనుకున్నారు. అయితే మిల్కాకే తిరిగి ఈ పదవి దక్కింది. ఇక ఫారెన్ సర్వీస్ ద్వారా ఉపాధికల్పన శాఖ అధికారిగా కూడా ఆమె కొనసాగుతున్నారు. ఈ శాఖకు అధికారిగా కొనసాగిన కిరణ్‌కుమార్, జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ విజయలక్ష్మి ఏసీబీకి పట్టుబడడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. మధ్యలో మంచిర్యాల జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారి వెంకటరమణకు ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ ఆయన అందుబాటులో ఉండడం లేదని కలెక్టర్ ఇక్కడ అందుబాటులో ఉండే అధికారికి ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించాలని భావించారు. ఎట్టకేలకు ఈ రెండు శాఖల అధికారుల నియామకంతో ఉత్కంఠకు తెరపడింది.

మీనం.. లక్ష్యం ఖరారు



- జిల్లాకు 1.23 కోట్లు కేటాయింపు
- గతేడాది కంటే 13లక్షలు అదనం
- నాలుగురకాల చేపపిల్లల పంపిణీ
- టెండర్లపై కాంట్రాక్టర్ల నిరాసక్తత

జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్లు: సాత్నాల, మత్తడివాగు, దేగామా ప్రాజెక్ట్
జిల్లాలోని చెరువులు: 242
మత్స్య పారిశ్రామిక సంఘాలు: 78
సంఘాల్లోని సభ్యుల సంఖ్య: 4,300

కైలాస్‌నగర్: చేపపిల్లల పంపిణీ లక్ష్యం ఖరారైంది. జిల్లా నుంచి చేసిన ప్రతిపాదన ప్రభుత్వం ఆమోదించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 1.23 కోట్ల చేపపిల్లలు కేటాయించనుంది. గతేడాది కంటే అదనంగా 13లక్షలు కేటాయించినట్లు అధికార యంత్రాంగం పేర్కొంది. మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా నిర్ణీత గడువులోగా చెరువులు, ప్రాజెక్టుల్లో ఉచితంగా చేపపిల్లలు వదులుతోంది. చేపపిల్లలు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానించారు. అయితే ప్రభుత్వం సీడ్ ధర తగ్గించడంతో వాటి సరఫరాకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు.

నాలుగు రకాల చేపలు

జిల్లాలోని ప్రాజెక్టులు, ప్రధాన రిజర్వాయర్లతోపాటు చెరువుల్లో చేపపిల్లలు వదలనున్నారు. వీటితోపాటు కొంతమంది రైతులు తమ పంటపొలాల్లో చిన్నపాటి చెరువులు తవ్వుకున్నారు. వాటిల్లోనూ చేపపిల్లలు వదులుతారు. జైనథ్ మండలం సాత్నాల, తాంసి మండలం మత్తడివాగు, బజార్‌హత్నూర్ మండలం దేగామ ప్రాజెక్టుల్లో 80నుంచి 100ఎంఎం సైజు లోగల చేపపిల్లలు వదలనున్నారు. మొత్తం నాలుగు రకాల చేప పిల్లలు పంపిణీ చేయనున్నారు. ప్రాజెక్టుల్లో కట్లా, రాహు, మృగాల వంటి మూడు రకాల చేప పిల్లలను 40, 50, 10 నిష్పత్తి చొప్పున 90లక్షల చేప పిల్లలను వదలాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇక మత్స్యశాఖకు సంబంధించిన 242 చెరువుల్లో కట్లా, రాహు, బంగారుతీగ చేపపిల్లలను 35, 35, 30 నిష్పత్తి చొప్పున 33లక్షల చేపపిల్లలు వదిలేలా ప్రణాళిక సిద్ధం చేశారు. గతేడాది 1.10 కోట్ల చేపపిల్లలు పంపిణీ చేశారు. ఈ సారి మరో 13లక్షల చేపపిల్లలు అదనంగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. వాటి పెంపుతో కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ఆర్థికంగా మరింత భరోసా కలగనుంది.

కొత్తగా 30 సంఘాల రిజిస్ట్రేషన్

చేపల వేటే జీవనాధారం చేసుకున్న మత్స్యకారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఇలా ఏర్పాటైన సంఘాలకు ప్రభుత్వాలు ఆర్థిక చేయూతతోపాటు చేపలు పట్టుకుని విక్రయించేందుకు అవసరమైన వాహనాలు, ద్విచక్రవాహనాలూ రాయితీపై అందిస్తున్నాయి. దీంతో మత్స్యకారులు ముందుకు వచ్చి సంఘాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. జిల్లాలో గతేడాది వరకు 78 సహకార సంఘాలు ఉండగా ఈ ఏడాది 30 సంఘాలను కొత్తగా రిజిస్ట్రేషన్ చేశారు. ఇందులో 500 మందిని సభ్యులుగా చేర్చారు. ఈ యేడాది నుంచి చేపపిల్లల పంపిణీతో వీరు ప్రయోజనం పొందనున్నారు.

ముందుకురాని కాంట్రాక్టర్లు

సకాలంలో చేపపిల్లలు పంపిణీ చేసేలా అధికారులు ఓ వైపు కసరత్తు చేస్తుంటే మరోవైపు వాటి సరఫరాకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం సీడ్ ధర తగ్గించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. గతేడాది చేపపిల్లల సీడ్ పంపిణీకి చిన్నసైజు వాటికి 63 పైసలు, పెద్దసైజు చేపలకు రూ.1.60 చొప్పున టెండర్లు నిర్వహించిన ప్రభుత్వం ఈ సైజు చేపపిల్లలకు రూ.1.50 చొప్పున ఖరారు చేసింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించింది. తొలిసారి పిలిచినప్పుడు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో చేపపిల్లల సీడ్ ధర కొంత పెంచారు. చిన్న సైజు చేపపిల్లలకు 56పైసలు, పెద్ద సైజు వాటికి రూ1.53కి పెంచి మరోసారి టెండర్లు పిలిచారు. అయితే రెండు సార్లు టెండర్లు పిలిచినా సీడ్ ధరలు తమకు అనుకూలంగా లేవని కాంట్రాక్టర్లు వాటి సరఫరాకు ముందుకురావడం లేదు. తాజాగా గురువారం టెండర్లను ఓపెన్ చేయగా ఒక్కటీ దాఖలు కాకపోవడం గమనార్హం. మరోసారి టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది

జిల్లాలోని నీటివనరుల్లో చేపపిల్లలు వదిలేందుకు ఈ ఏడాది లక్ష్యాన్ని ఖరారు చేశాం. వాటి సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెలాఖరువరకు టెండర్లు ఖరారయ్యే అవకాశముంది. ఎల్1గా టెండర్ దాఖలు చేసిన వారికి వాటి సరఫరా బాధ్యతలు అప్పగిస్తాం. రెండుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. టెండర్లు ఖరారైన వెంటనే నిర్ణీత గడువులోగా నీటి వనరుల్లో వాటిని వదిలేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.
– సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

రాజకీయాలకతీతంగా పట్టణాభివృద్ధి

- ఎమ్మెల్యే జోగు రామన్న



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

కైలాస్‌నగర్: రాజకీయాలకు అతీతంగా పట్టణాభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్‌లో రూ.80లక్షలతో అభివృద్ధి చేసిన జంక్షన్‌ను గురువారం రాత్రి ప్రారంభించారు. అనంతరం లేజర్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలోని 41వేల ఇండ్లకు శుద్ధజలాన్ని అందిస్తున్నామని చెప్పారు. కొన్ని వార్డులకు నిత్యం, మరికొన్ని వార్డులకు రోజువిడిచి రోజు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు ప్రతీ ఇంటికి నీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 24గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. కళ్ల ముందే అభివృద్ధి కనిపిస్తుంటే ప్రతిపక్షాలు విమర్శలు చేయడం విచారకరమని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, అడిషనల్ కలెక్టర్ నటరాజ్, ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ ఉమేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, మున్సిపల్ కమిషనర్ శైలజ, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జంక్షన్ ప్రారంభోత్సవంలో అపశృతి

పట్టణంలోని తెలంగాణచౌక్‌లో నిర్వహించిన జంక్షన్ ప్రారంభోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. కార్యక్రమం సందర్భంగా పెద్ద ఎత్తున పటాకులు కాల్చగా ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు పడి సమీప పండ్ల దుకాణంలో మంటలు చెలరేగాయి. పక్కనే ఫైర్‌స్టేషన్ ఉండగా వెంటనే సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు.

పల్లెప్రగతిలో అంబుగాం ఆదర్శం



పంచాయతీ కార్మికుడిని సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు, ప్రజాప్రతినిధులు

తాంసి: నూతన పంచాయతీగా ఏర్పడిన అంబుగాం పల్లెప్రగతితో స్వచ్ఛత, పారిశుధ్యంలో మెరుగై ఆదర్శంగా నిలిచిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అంబుగాం గ్రామంలో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ కొమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టర్‌ను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. పంచాయతీ కార్మికుడిని శాలువాతో సన్మానించి సేవా పత్రాన్ని అందజేశారు. గ్రామస్తులు కలెక్టర్‌కు సమస్యలు తెలుపగా పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఎంపీపీ మంజుల, సర్పంచ్ తుర్పాబాయి, గిరిగాం సర్పంచ్ గజానన్, ఎంపీడీవో భూమయ్య, తహసీల్దార్ శ్రీదేవి, ఏవో రవీందర్, ఎంపీవో సుధీర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మేఘరాజ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, గ్రామ పటేల్ మల్కుపటేల్, భారత్ తదితరలున్నారు.

రైతులకు నాణ్యమైన సేవలందించాలి

- జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

గుడిహత్నూర్: రైతులకు నాణ్యమైన సేవలందించాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని సీతాగోంది రైతువేదికలో గురువారం జిల్లా ఆగ్రో రైతు సేవా కేంద్రాల డీలర్లకు 2023 వానాకాలం సీజన యాక్షన్ ప్లాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రికార్డులు ఎప్పటికప్పుడు సిద్ధం చేసి భద్రపర్చాలన్నారు. అంతకుముందు తెలంగాణ ఆగ్రోస్ రీజినల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. తమ ఆగ్రోస్ కేంద్రాలు మండలానికి రెండు, మూడు చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కేంద్రాల ద్వారా పేరుగాంచిన కంపెనీలతో ఒప్పందం చేసుకొని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, టార్పాలిన్లు, స్ప్రేయర్స్, డ్రోన్లు, రొటోవేటర్ల సేవలందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వీరు మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఏవో రేవతి, ఆగ్రోస్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వికాస్, ఏఈవోలు శ్రీధర్, వెంకట్, జిల్లాలోని ఆగ్రో డీలర్లు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న డిపో మేనేజర్

ఆదిలాబాద్: ఆర్టీసీ ఆధ్వర్యంలో ఇస్తున్న హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన కోరారు. గురువారం ఆదిలాబాద్ డిపో ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలు భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రస్తుతం ఏడుగురితో శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 7382840166 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తునికాకు అక్రమంగా తరలిస్తున్న ఆటోల పట్టివేత

బోథ్: మండలంలోని నిగిని గ్రామం నుంచి బోథ్ మండల కేంద్రానికి తునికాకు తరలిస్తున్న రెండు ఆటోలను గురువారం పట్టుకున్నట్లు బోథ్ అటవీ శాఖ రేంజ్ అధికారి తొడిశెట్టి ప్రణయ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నిగిని గ్రామం నుంచి రెండు ఆటోల్లో రాథోడ్ సోఫాన్, రాథోడ్ కిరణ్‌లు తూని కాకును బోథ్ మండల కేంద్రానికి తరలిస్తుండగా పట్టుకుని స్థానిక అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. తునికాకు విలువ దాదాపు రూ.2లక్షల వరకు ఉంటుందని ఆ యన తెలిపారు. పూర్తిస్థాయి విచారణ తరువాత కేసు నమోదు చేస్తామని తెలిపారు.

హలో నేను.. ఎమ్మార్వో ఆఫీస్ నుంచి...



మహిళకు పంపిన వాట్సాప్ మేసేజ్‌లు



అటెండర్‌కు దేహశుద్ధి చేస్తున్న మహిళలు

- ఫోన్ లిఫ్ట్ చేయకపోతే ఇప్పుడే ఇన్‌కమ్ సర్టిఫికెట్ రిజెక్ట్ చేస్తా
- ఓ మహిళతో ఫోన్‌లో అసభ్యకరమైన వాయిస్ రికార్డింగ్
- నేరడిగొండ తహసీల్దార్ కార్యాలయ అటెండర్‌కు దేహశుద్ధి

నేరడిగొండ: హలో నేను నీ ఇన్‌కమ్ సర్టిఫికెట్ కొట్టిన కదా ఎమ్మార్వో ఆఫీస్ నుంచి.. తిన్నవా అని అడిగినా సప్పుడే చేస్తలేవు.. నీ భర్త ఫారెన్ వెల్లాడు కదా.. నా ఫ్రెండే అతను ఆల్‌రెడీ.. మీరు ఏమనుకుంటున్నారు.. ఇప్పుడంటే ఇప్పుడే నీ సర్టిఫికెట్ రిజెక్ట్ చేసేస్తాను.. నేను ఏదిచేయాలో అది చేస్తాను నా చేతిలో ఉంటదది.. అంటూ జూనియర్ అసిస్టెంట్ పేరు చెప్పి నేరడిగొండ తహసీల్దార్ కార్యాలయానికి చెందిన అటెండర్ అశోక్ ఓ మహిళ ఫోన్‌కు అసభ్యకరమైన రికార్డింగ్‌లు పంపించాడు.

అటెండర్‌కు దేహశుద్ధి...

అటెండర్ అశోక్‌కు గురువారం గ్రామస్తులు, మహిళలు దేహశుద్ధి చేశారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయానికి వచ్చిన ఓ మహిళ ఫోన్ నంబర్‌ను దరఖాస్తు నుంచి తీసుకొని ఓ అధికారి పేరిట సదరు మహిళ ఫోన్‌కు అసభ్యకరమైన రికార్డింగ్‌లు పంపించాడు. తనతో మాట్లాడితేనే సర్టిఫికెట్ అప్రూవ్ అవుతుందని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని బాధిత మహిళ గ్రామస్తులకు తెలియజేయడంతో వారు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న అటెండర్‌ను గ్రామస్తులు, మహిళలు చితకబాదారు. ఆయా పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంపై మండిపడ్డారు. రోజురోజుకు మహిళలకు రక్షణ లేకుండా పోతోందని వాపోయారు. అనంతరం ఆ అటెండర్‌ను పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఈవిషయమై తహసీల్దార్ పవన్‌చంద్రను వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

ముఖరా(కే) పంచాయతీకి ఐఎస్వో సర్టిఫికెట్



సర్పంచ్ మీనాక్షికి సర్టిఫికెట్ ఇస్తున్న మంత్రి దయాకర్‌రావు

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా(కే) పంచాయతీ సర్పంచ్ గాడ్గే మీనాక్షికి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయకర్‌రావు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఐఎస్వో సర్టిఫికెట్ అందజేశారు. తెలంగాణ పల్లెప్రగతి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను అభినందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ముఖరా(కే) రాష్ట్రానికే ముఖచిత్రంగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యకార్యదర్శి శాంతకుమారి, ముఖరా(బీ) ఎంపీటీసీ గాడ్గే సూభాష్ పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై శిక్షణ

- ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అవకాశం
- ఆన్‌లైన్ దరఖాస్తుకు నేడే ఆఖరి గడువు

భైంసాటౌన్: ఇస్రో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఏటా అంతరిక్ష విజ్ఞానంపై శిక్షణ అందిస్తోంది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ తరఫున వేసవి సెలవుల్లో ఆన్‌లైన్ మాధ్యమంగా ఈ శిక్షణ అందిస్తోంది. 9 నుంచి 12వ తరగతులకు భౌతిక, రసాయన, జీవ, గణితశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 16తో దరఖాస్తు గడువు ముగియనుంది. ఐదు రోజులపాటు కొనసాగే కోర్సు పూర్తి చేసుకున్నవారికి ప్రశ్నాపత్రం ఉంటుంది. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి ధ్రువపత్రాలు అందిస్తారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. తద్వారా విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించవచ్చు.

ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చంటే...

ఇస్రో ఆధ్వర్యంలో అంతరిక్ష విజ్ఞానంపై శిక్షణ అందిస్తోంది. ఏటా కాలానుగుణంగా వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణకు ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థల్లో బోధించే ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఐఆర్ఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలతో నమోదు చేసుకోవాలి. ఈ నెల 19 నుంచి 23 వరకు ఐదు రోజుల పాటు శిక్షణ ఉంటుంది. జిల్లా నుంచి ఏటా పలువురు ఉపాధ్యాయులు ఈ ఆన్‌లైన్ శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈసారి సైతం ఉపాధ్యాయులు శిక్షణకు దరఖాస్తు చేసుకోనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఇస్రో ఆధ్వర్యంలో ఏటా ఆన్‌లైన్ శిక్షణ అందిస్తోంది. అంతరిక్ష విజ్ఞానంపై ఐదురోజుల కోర్సు ఉంటుంది. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి. అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకునేందుకు శిక్షణ దోహదపడనుంది. **వినోద్, జిల్లా సైన్స్ అధికారి, నిర్మల్**

అటవీహక్కు పత్రాలు ఇవ్వకుండా మోసం

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీలు ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా బీఆర్ఎస్ మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత ఆరోపించారు. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలం చిన్నలోకారి, పెద్దలోకారి గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలపై వివరించారు. వారు మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్లు, రుణమాఫీ తదితర హామీలు బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ అకారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ప్రతి ఒక్కరికీ రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు సంజయ్ దుబే, నాయకులు సంతోష్, రవి, మోతీరాం, సాధిక్ తదితరులున్నారు.

జిల్లా క్రికెటర్ ట్రిపుల్ సెంచరీ



హిమతేజ

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రికెటర్ కొడిమెల హిమ తేజ ట్రిపుల్ సెంచరీ సాధించాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న లీగ్ మ్యాచ్‌ల్లో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ తరఫున హిమ తేజ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జట్టుతో జరుగుతున్న ఈ టెస్ట్ మ్యాచ్లో ఎస్‌బీఐ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 10 వికెట్ల నష్టానికి 405 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో రెండవ రోజు 150 పరుగులతో అజేయంగా నిలిచిన హిమ తేజ, మూడవరోజు 319 పరుగులతో ట్రిపుల్ సెంచరీ చేశాడు. దీంతో జిల్లాకు చెందిన పలువురు క్రికెటర్లు హిమ తేజను అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన వాహనం

నార్నూర్: మండలంలోని ఎస్సీ వసతి గృహం వద్ద గురువారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్సై రవికిరణ్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన టోకిర్‌ఖాన్ అనే యువకుడు మాక్స్ వాహనంలో ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నార్నూర్ నుంచి ఉట్నూర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఎస్సీ వసతి గృహం వద్ద పట్టుకున్నారు. వాటిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డెప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌కు అప్పగించినట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి మండల కేంద్రంలోని డీఆర్‌డీపోకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన బానావత్ రమేష్ (33) చాతినొప్పి తాళలేక గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రెండుటౌన్ ఎస్సై ఊశన్న తెలిపారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే మృతుడి నెలరోజుల క్రితం చాతినొప్పికి ఆస్పత్రిలో చికిత్స పొందాడు. నొప్పితగ్గడం లేదనే బాధతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో దులానికి ఉరేసుకున్నాడు. ఆ సమయంలో ఇంటికి వచ్చిన మృతుడి మరదలు పిలిచిన తలుపు తీయకపోవడంతో మృతుడి భార్య లక్ష్మికి సమాచారమందించింది. వారు తలుపులు తెరిచి చూడగా దులానికి వేలాడుతు కన్పించాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి) గ్రామంలోని శాంతినగర్ కాలనీకి చెందిన జాదవ్ సంగీత (20) గురువారం అదృశ్యమైనట్లు ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శాంతినగర్ కాలనీకి చెందిన జాదవ్ బాబ్యు కుమార్తె సంగీత గురువారం ఉదయం 8గంటలకు కౌట్ల(బి) గ్రామంలోని మీసేవా కేంద్రానికి వెళ్లింది. తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ కానరాలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరి అరెస్టు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో భూ తగాదాల విషయంలో తండ్రి కొడుకులపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై హన్మండ్లు పేర్కొన్నారు. ఎస్సై వివరాల ప్రకారం... మండలంలో ఈ నెల 10న పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన సూర్యవంశీ పాండురంగ్, అంబాదాస్ తండ్రి కొడుకులపై ఆకాష్, సూర్యవంశీ ఆనంద్‌రావులతో పాటు మరో నలుగురు కర్రలు, గొడ్డళ్లతో దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. అంబాదాస్ భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆకాష్, ఆనంద్‌రావులను మండలంలోని కల్లూరులో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కర్రలు, గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భైంసా కోర్టులోని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. మిగతా నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బండెక్కిన అభిమానం



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, ఓం రౌత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆదిపురుష్ చిత్రం శుక్రవారం విడుదల కానుంది. ఆదిలాబాద్ పట్టణం రవీంద్రనగర్‌కు చెందిన బ్యూటీ పార్లర్ నిర్వహించే స్వప్న ప్రభాస్‌కు వీరాభిమాని. ఆమె ఆరాధ్య దైవం రాముడు పాత్రలో ప్రభాస్ నటించిన ఆ చిత్రాలతో కూడిన స్టిక్కర్లను తన స్కూటీపై అంటించుకుంది. దీన్ని చూసిన ప్రజలు ప్రభాస్‌పై ఆమెకున్న అభిమానానికి ఫిదా అవుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్